సన్మానం

మన్సూరాబాద్: స్పెషల్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య సెలక్షన్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతి పొందారు. శనివారం సర్కిల్ కార్యాలయంలోని ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు డాక్టర్ తిప్పర్తి యాదయ్యను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ దినేష్‌సింగ్, సూపరింటెండెంట్ మహేందర్, విక్రమ్, సుధాకర్‌రావు, బలరామ్ పాల్గొన్నారు.

శంకుస్థాపన

వనస్థలిపురం: బీఎన్‌రెడ్డినగర్ మెయిన్ రోడ్డులో గణేష్ ఎలక్ట్రికల్ షాపు కూడలి వద్ద బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి తన సొంత నిధులతో నిర్మిస్తున్న శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ ముఖద్వారం పనులకు శనివారం ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సోమిరెడ్డి, కన్వీనర్ వెంకటేశ్వర్ రావు, కార్యదర్శి జానకిరామారావు, కాలనీల నాయకులు పుల్లారెడ్డి, అమరేందర్‌రెడ్డి, రఘురాంనేత, సుధాకర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, ధనరాజ్, రవిందర్‌రెడ్డి, రాంబాబు, ఆలయ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్‌కు స్పందన



వస్త్రాలు కొనుగోలు చేస్తున్న మహిళలు

వనస్థలిపురం: వనస్థలిపురంలో హుడా కమ్యూనిటీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ ఎక్స్‌పో (ఎగ్జిబిషన్ అండ్ సేల్)కు స్పందన వస్తోందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఎగ్జిబిషన్‌లో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, డిజైనర్, కాంతావర్క్, హ్యాండ్ బ్లాక్, ప్రింటెడ్, లినెన్, కళంకారీ, బెంగాల్ కాటన్, లక్నో చికాన్, బనారస్ చీరలు, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌజెస్ తదితర ఉత్పత్తులు తగ్గింపు ధరలకు లభిస్తాయని నిర్వాహకులు అక్బర్‌అలీ పేర్కొన్నారు.

పీడబ్ల్యూడీ కార్యాలయానికి నోటీసులు

చాదర్‌ఘాట్: మలక్‌పేట్‌లోని వికలాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్స్‌ల సంక్షేమ శాఖ కార్యాలయానికి జీహెచ్‌ఎంసీ సర్కిల్–6 అధికారులు ఆస్తిపన్ను బకాయిల నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా డీసీ జయంత్ మాట్లాడుతూ.. ఈ కార్యాలయం బకాయి రూ. 5 కోట్లు ఉందని అందుకు నోటీసులు జారీ చేశామన్నారు.

బధిర చిన్నారులకు సేవలు అందించడం అభినందనీయం



బధిర విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

మలక్‌పేట: మాట వినికిడి లోపం గల బాలబాలికలకు సేవలు అందించడం అభినందనీయమని రాష్ట్ర ప్రభుత బాల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యురాలు వందన అన్నారు. మలక్‌పేటలోని ఫిన్ బధిరుల ఆశ్రమ పాఠశాల 18వ వార్షికోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చదువుతో పాటు సాఫ్ట్ స్కిల్స్, ఆటలు, హ్యాండ్ క్రాఫ్ట్, కంప్యూటర్ విద్య నేర్పించడం పిల్లల భవిష్యత్‌కు ఎంతో దోహదపడుతుందన్నారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గ్లోబల్ డాట కంపెనీ సీఎస్‌ఆర్ వింగ్ ప్రసన్న, ఫిన్ సంస్థ డైరెక్టర్ జానకి, జనరల్ సెక్రటరీ బాలకృష్ణారెడ్డి, కోశాధికారి మహ్మద్ బాబుజాన్, ప్రిన్సిపాల్ సరస్వతి, మాధవి పాల్గొన్నారు.

జేఈఈలో సత్తా



సాక్షి, సిటీబ్యూరో: జేఈఈ ఫలితాల్లో సత్తా చాటిన దిల్‌సుఖ్‌నగర్ నారాయణ కళాశాల డే డివిజన్ విద్యార్థులను డీన్ రామ్మోహన్, అమరేందర్, డీజీఎం రాజు, ఏజీఎం గోవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయుల బృందం అభినందించి సన్మానించారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు టమాటా రూ.15, వంకాయ రూ.18, బెండ రూ.35, పచ్చిమిర్చి రూ.33, కాకరకాయ రూ.32, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.09, క్యారెట్ రూ.18, దొండ రూ.18, ఆలుగడ్డ రూ.25, ఉల్లిగడ్డ రూ.18.

నిజమండి.. ఇది మాదన్నపేట మండి

- దుర్గంధంగా కూరగాయల మార్కెట్
- దృష్టి సారించాలంటున్న ప్రజలు
- విస్మరిస్తున్న అధికారులు



డంపింగ్ యార్డును తలపిస్తున్న మాదన్నపేట మండి

చంచల్‌గూడ: నగరంలోనే అతి పెద్ద కూరగాయల మార్కెట్‌గా పేరుగాంచిన మాదన్నపేట మండి దుర్గంధంగా మారుతోంది. చినుకులకే మార్కెట్ మొత్తం ఛిద్రమవుతుంది. మురుగు, వరదనీరు, చెత్తాచెదారం, కుళ్లిన వ్యర్థాలతో ముక్కుపుటలదిరే దుర్వాసన వస్తోందని క్రయ విక్రయదారులు వాపోతున్నారు. ప్రజలకు శుభ్రమైన కూరగాయలను అందించే ఈ మండి పారిశుద్ధ్య నిర్వహణ లోపానికి గురవుతుంది. ఎన్ని ప్రభుత్వాలు మారినా, వ్యవసాయ కమిటీ పాలకులు మారినా ఇక్కడి చెత్త సమస్యలు మాత్రం పరిష్కారం అవ్వడం లేదు. మండిలో పారిశుద్ధ్యం సక్రమంగా లేకపోవడంతో రైతులు, వ్యాపారులు అనారోగ్యాలకు గురవుతున్నారు. మార్కెట్‌లో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. చినుకులు కురిస్తే కుంటలా తలపిస్తోంది.



శిథిలావస్థలో షెడ్లు

ఆదాయంపైనే దృష్టి..

దశాబ్దాల క్రితం నిర్మించిన షెడ్లు శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. కమీషన్ ఏజెంట్ వ్యవస్థ ద్వారా రైతుల నుంచి వచ్చే ఆదాయం పైనే హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ దృష్టి పెడుతుంది. వసూలు చేసిన ఫీజులో ఒక్క రూపాయి కూడా మార్కెట్‌లో సౌకర్యాలు కల్పించడానికి ఖర్చు చేయడం లేదు. చెత్త తరలింపు విషయంలో వ్యవసాయ మార్కెట్ శాఖ, జీహెచ్‌ఎంసీ శాఖల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తుంది. ప్రభుత్వానికి కమీషన్ వ్యవస్థ ద్వారా నెలకు రూ.లక్షల్లో ఆదాయం వస్తున్నామండి మౌలిక సౌకర్యాల కల్పనలో విఫలమవుతుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

గ్రూప్–1 పరీక్షను మళ్లీ నిర్వహించాలి



మాట్లాడుతున్న నీరటి ప్రసాద్ పటేల్

మన్సూరాబాద్: గ్రూప్–1 పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని నవతరం స్టూడెంట్ ఫెడరేషన్ (ఎన్‌ఎస్‌ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు నీరటి రామ్‌ప్రసాద్ పటేల్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రూప్–1 పరీక్ష నిర్వహించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, నిరుద్యోగుల జీవితాలు అగాధంలోని నెట్టివేయబడ్డాయని మండిపడ్డారు. నియామకాల్లో పారదర్శకత, జవాబుదారీతనం లేదని తేటతెల్లమైందని విమర్శించారు. ఒక్క పరీక్షా కేంద్రంలో రాసిన అభ్యర్థులకు అధిక సంఖ్యలో ఫలితాలు రావటంతో అనుమానాలకు తావిచ్చిందన్నారు. గత ప్రభుత్వం నిరుద్యోగులకు అన్యాయం చేస్తుందని గగ్గోలు పెట్టి అధికార పీఠం ఎక్కిన కాంగ్రెస్ పార్టీ అవే తప్పిదాలు చేస్తూ నిరుద్యోగులకు అన్యాయం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



విజేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న డీఈఓ విజయకుమారి

నాగోలు: సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని మేడ్చల్ డీఈఓ విజయకుమారి పేర్కొన్నారు.కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసిన కోమటిరెడ్డి విజేందర్‌రెడ్డి పదవీ విరమణ సందర్భంగా శనివారం పాఠశాల ఆవరణంలో నిర్వహించిన అభినందన సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. నాలుగు దశాబ్దాల కాలం విద్యార్థులకు ఎనలేని సేవలు అందించి పదవి విరమణ చేసిన కోమటిరెడ్డి విజేందర్‌రెడ్డిని ఇతర ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధికి విజేందర్‌రెడ్డి ఎంతో కృషి చేశారని అన్నారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్, మేడ్చల్ జిల్లా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం నాయకులు రాంరెడ్డి, మురళి మోహన్, లక్ష్మి, లత, రామారావు, కమలకర్, కృష్ణారెడ్డి, పూర్వ విద్యార్థులు రాంనాథ్‌రెడ్డి, రమేష్, గణేష్, శైలజ, చంద్రలేఖ, కల్యాణి పాల్గొన్నారు.

బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలి



మమతాబెనర్జి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

చైతన్యపురి: వక్ఫ్ చట్టం పేరుతో గత వారం రోజులుగా బెంగాల్‌లో హింస, అల్లర్లు జరుగుతున్నా ఆ రాష్ట్ర ప్రభుత్వం హిందూ కుటుంబాల భద్రత కోసం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి ఆధ్వర్యంలో శనివారం దిల్‌సుఖ్‌నగర్ రాజీవ్‌చౌక్‌లో నిరసన తెలిపారు. బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జి, దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ జాతీయ అధికార ప్రతినిధి రావినూతల శ్రీధర్ మాట్లాడుతూ.. వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకించటం పేరుతో బెంగాల్ మొత్తం హింసాకాండలో కాలిపోతున్న తీరు, హిందువులను హింసిస్తున్న తీరు జాతి వ్యతిరేక, హిందూ వ్యతిరేక శక్తుల కుట్రలకు అక్కడి ప్రభుత్వం స్వేచ్ఛ ఇస్తున్న తీరు చూస్తే బెంగాల్‌లో పరిస్థితి ఆందోళనకరంగా ఉందని స్పష్టం అవుతుందన్నారు. వెంటనే బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, రంగా నర్సింహ గుప్తా, నాయకులు రాజేందర్‌రెడ్డి, సాయిరాం, సుధాకర్, సుధీర్, బ్రహ్మచారి, అనంతాచారి, నవీన్, రాజేందర్ పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధే లక్ష్యం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: డివిజన్ అభివృద్ధే లక్ష్యంగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. హయత్‌నగర్ పరిధిలోని టీనగర్‌కాలనీలో రూ.11 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి పనులు చేపడుతున్నమన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని కోరారు. పెండింగ్ పనులను మరో ఐదు నెలల్లో పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. రూ.5 కోట్ల అంచనాలను మేయర్, కమిషనర్ పరిశీలనలో ఉన్నాయని, త్వరలోనే మంజూరు చేయిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు శ్రీనివాసరావు, యాదగిరిరెడ్డి, నిరంజన్ రావు, భాస్కర్, సతీష్, శ్రీనివాస్‌రెడ్డి, మల్లారెడ్డి, నాయకులు కడారి యాదగిరియాదవ్, పాతూరి శ్రీధర్‌గౌడ్, ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

తాగునీరు.. రోడ్డుపాలు



నాగోలు: పేద ప్రజలు నివాసముండే బస్తీల్లో తాగునీరు లేక ఇబ్బందులు పడుతుంటే.. నాగోలు బండ్లగూడ రహదారి కియా కార్ సర్వీస్ సెంటర్ వద్ద నాలుగు రోజులుగా తాగునీరు పైప్‌లైన్ పగిలి నీరంతా రోడ్డు పాలవుతోంది. ఈ విషయం స్థానిక కాలనీవాసులు జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పైపులైన్‌కు మరమ్మతు చేసి నీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

'డబుల్' ఇళ్ల కేటాయింపులో అవకతవకలు'

మలక్‌పేట: మూసీ పరీవాహక ప్రాంతావాసులకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన డబుల్ బెడ్రూమ్‌ల పంపిణీలో అవకతవకలు చోటు చేసుకున్నాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల పంపిణీపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టిన నిజమైన లబ్ధిదారులకు అందేలా చూడాలని కోరుతున్నారు. సైదాబాద్ మండల పరిధిలోని మూసారంబాగ్ డివిజన్‌లో మూసీ తీరప్రాంతంలో ఉన్న అజేయ్ హట్స్, సంపత్ హట్స్, అంబేద్కర్ కాలనీ, సాయిలు హట్స్‌లో రెవెన్యూ అధికారులు లొకేషన్ మార్కు, ఐడీ ఉన్న గుడిసెలను తనిఖీలు చేసి అర్హులను గుర్తించారు. అర్హులైన వారి జాబితాను తయారు చేసి వారిలో కొంత మందికి ప్రతాప్‌సింగారంలో ఇళ్లు కేటాయించారు. ఇంకా కొంత మందికి కేటాయింపు చేయలేదు. అయితే జాబితాలో పేర్లు లేనివారికి కేటాయించారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం రెవెన్యూ డివిజనల్ అధికారులకు దృష్టికి తీసుకెళ్లగా అందరికి ఇచ్చామని చెబుతున్నారని, అయితే జాబితాలో పేర్లు ఉన్న గుడిసెవాసులకు ఇళ్లు రాలేదని పేర్కొన్నారు. స్థానిక నాయకులు, అధికారులు కుమ్మక్కై నిజమైన లబ్ధిదారులకు ఇళ్లు ఇవ్వకుండా ఇతరులకు కట్టబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుడిసెల్లో నివాసం ఉంటున్న పేదలకు న్యాయం చేయాలని ఎలక్ట్రికల్ రాజు అధికారులను కోరుతున్నారు.

సన్న బియ్యంతో ప్రజలు ఆనందం



సహపంక్తి భోజనం చేస్తున్న జితేందర్‌తో మెట్టు వెంకటరెడ్డి

చంపాపేట: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు పరిచిన సన్నబియ్యం పంపిణీ పేదల కడుపు నింపుతుందని తెలంగాణ ప్రదేశ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ అన్నారు. శనివారం ఆయన సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి మెట్టు వెంకటరెడ్డితో కలిసి చంపాపేట డివిజన్ సూర్యానగర్ కాలనీలోని తెల్లరేషన్ కార్డు లబ్ధిదారులు జ్యోతి నివాసంలో సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సన్నబియ్యంతో రాష్ట్ర ప్రజలు ఆనందంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బండి సురేందర్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి ఈవూరి భద్రీనాథ్ గుప్తా, నాయకులు భగవాన్ జీ, చింటూ, రాజు పాల్గొన్నారు.

ఇద్దరి నడుమ వాగ్వాదం

బైక్ తగలబెట్టిన వైనం

నాగోలు: ఇద్దరి వ్యక్తుల నడుమ ఏర్పడిన వివాదంలో ద్విచక్ర వాహనాన్ని తగలపెట్టిన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. తట్టిఅన్నారం, హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన మేస్త్రీ షేక్ మహబూబ్ బాషా వద్ద షేక్ మౌలాలి అనే వ్యక్తి పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి మహబూబ్ బాషా, షేక్ మౌలాలి ఇద్దరు తట్టిఅన్నారంలోని ఓ వైన్స్ వద్ద మద్యం తాగారు. కాసేపటి తర్వాత మహబూబ్ బాషా వద్ద పనిచేసే ఇద్దరు కార్మికులు షేక్ నూర్‌బాషా, సురేష్, మహబూబ్ బాషాకు చెందిన పల్సర్ బైక్ ఏపీ12ఈ8072 పై అదే వైన్ షాపునకు వచ్చారు. వారు అక్కడ ఉన్నప్పుడు టైల్స్ కటింగ్ మెషిన్ పాడు చేశావని షేక్ నూర్‌బాషాను మహబూబ్ బాషా తిట్టాడు. ఈ విషయంతో ఇద్దరి నడుమ వాగ్వాదం జరిగింది. దీంతో మహబూబ్‌బాషా తన బైక్‌ను అక్కడే వదిలేసి వెళ్లాడు. షేక్ నూర్‌బాషా అక్కడ నుండి వెళ్లి పోయి తర్వాత రేణుకా వైన్స్ దగ్గరకు మళ్లీ వచ్చి మహబూబ్ బాషా బైక్‌పై పెట్రోల్ పోసి తగలబెట్టి వెళ్లిపోయాడు. తన బైక్ మంటల్లో కాలిపోతోందని తెలుసుకున్న మహబూబ్ బాషా వెంటనే ఘటనా స్థలానికి చేరుకునేలోపు పూర్తిగా కాలిపోయింది.

అభివృద్ధిని చూసి ఓర్వలేక రాద్ధాంతం



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

వనస్థలిపురం: ఇతర పార్టీలకు చెందిన కార్పొరేటర్లు అభివృద్ధి విషయంలో దూసుకుపోతుంటే చూసి ఓర్వలేక, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అనవసర రాద్ధాంతాం చేస్తున్నారని బీజేపీ రంగారెడ్డి (అర్బన్) జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు సామ రంగారెడ్డి ఆరోపించారు. శనివారం వనస్థలిపురంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పడిపోగానే ఎమ్మెల్యే చిన్నపిల్లాడిలా ప్రవర్తిస్తున్నారని, కార్పొరేటర్లను టార్గెట్ చేస్తూ వారిపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే హయాంలోనే చెరువులు కబ్జాకు గురయ్యాయని ఆరోపించారు. బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. శివారు కాలనీలకు డ్రైనేజీ సౌకర్యం కోసం జలమండలి జీఎం, డీజీఎంలను తీసుకువచ్చి పనులు చేపట్టాలని కోరడం జరిగిందని, ఎట్టకేలకు పనులు ప్రారంభమవుతుంటే ఎమ్మెల్యే, ఆయన అనుచరులు వచ్చి తామే పనులు మంజూరు చేయించామని చెప్పుకుంటున్నారన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు వంగా మధుసూదన్ రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి, పవన్‌కుమార్, ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రైస్తవ సమాజం ఐక్యతను చాటి చెప్పాలి



రన్‌ఫర్ జీసస్ ర్యాలీ పాల్గొన్న క్రైస్తవులు

మలక్‌పేట: క్రైస్తవ సమాజాన్ని బలపరుస్తూ ఐక్యత చాటిచెప్పాలని, యేసుక్రీస్తు చూపిన ప్రేమా, క్షమా గుణం కలిగి ఉండాలని పాస్టర్ బిషప్ తిమోతి కొల్లబత్తుల సూచించారు. ఈస్టర్ సండేను పురస్కరించకుని శనివారం మలక్‌పేటలో నిర్వహించిన రన్ ఫర్ జీసస్ ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. దిల్‌సుఖ్‌నగర్ బాప్టిస్టు చర్చి నుంచి ప్రారంభమైన ర్యాలీ మూసారంబాగ్ చౌరస్తా, మలక్‌పేట డీమార్ట్, నల్లగొండ క్రాస్‌రోడ్, ఎంబీ చర్చి, మలక్‌పేట ఫైర్ స్టేషన్, అక్బర్‌బాగ్ చౌరస్తా, హోరేబు చర్చి, బీ–బ్లాక్, సైదాబాద్ బేతేలు చర్చి, అస్మాన్‌ఘడ్ రాక్‌చర్చి వరకు కొనసాగిందన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రధానకార్యదర్శి సాల్మన్‌రాజ్, కోశాధికారి కేపీ సామేల్, పాస్టర్లు రెవరెండ్ మెన్నోజోయల్, క్రిస్టోఫర్, శాంత్‌కుమార్, క్రైస్తవ సంఘాల నాయకులు శ్రీధర్‌రాజు, మోజెస్, నవీన్, పాల్గొన్నారు.

హోరేబు చర్చి వద్ద ర్యాలీ ఘన స్వాగతం..

అక్బర్‌బాగ్ ఆంధ్రకాలనీలోని హోరేబు చర్చి వద్ద రన్ ఫర్ జీసస్ ర్యాలీకి ఘన స్వాగతం పలికారు. రన్ పాల్గొన్న క్రైస్తవులకు పండ్లు. శీతల పానీయాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జే.బీ జయరాజ్, ఆర్డీసీ సామేల్, సత్యానంద్, అనిల్‌కుమార్, రవి, జాన్సన్, విజయ్, సుశీల్, నవీన్, సునీల్ ఉన్నారు.

కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలి



ఫిర్యాదు చేస్తున్న బీజేవైఎం నాయకులు

మలక్‌పేట: ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని బీజేవైఎం భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు అనుముల భరత్ ఆధ్వర్యంలో శనివారం మలక్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ.. ఈడీ కార్యాలయం ముందు కాంగ్రెస్ చేపట్టిన ధర్నాలో మోదీ, కేంద్రమంత్రిపై ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ చేసిన వ్యాఖ్యలు తీవ్రంగా ఖండించారు. దేశప్రధానిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమని వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దినేష్, నవీన్ బండారి, జగన్,భార్గవ చారి, నవీన్, పటాలీయా, ఆశీష్, రేవంత్, రోహన్, సుభాష్, ప్రశాంత్, ఉమేష్ చంద్ర పాల్గొన్నారు.

పార్థీవాడలో డ్రైనేజీ, రోడ్డు సమస్యలు పరిష్కరిస్తాం



పార్థీవాడలో కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: వనస్థలిపురం డివిజన్ పరిధి పార్థీవాడ (పిట్టలబస్తీ)లో డ్రైనేజీ, రోడ్డు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం బస్తీవాసుల కోరిక మేరకు ఆయన పార్థీవాడలో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. డ్రైనేజీ గురించి ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, బస్తీ మురుగునీటి వ్యవస్థను సమీపంలోని శ్రీకృష్ణానగర్ పక్కనే ఉన్న డ్రెయిన్‌లో కలిసేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం రోడ్ల నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు చింతల రవికుమార్, కాలనీ అధ్యక్షుడు శక్తికిషోర్, బబ్లూ, అజయ్, రాజ్, కిరణ్, మహేష్, లోకేష్, ఊర్వశి పాల్గొన్నారు.

రోడ్డును త్వరగా పూర్తిచేయాలి..

పార్థీవాడలో కొత్తగా మంజూరైన సీసీ రోడ్డును త్వరగా పూర్తి చేయాలని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన కాలనీలో పర్యటించి రోడ్డు పనులను పర్యవేక్షించారు. వర్షాలను దృష్టిలో ఉంచుకుని రోడ్డు నిర్మాణం త్వరగా పూర్తిచేసి కాలనీ వాసులు ఇబ్బందులు పడకుండా చూడాలని సూచించారు.

తవ్వారు.. వదిలేశారు



చైతన్యపురి: నూతన రహదారి నిర్మాణం కోసం ఉన్న రోడ్డును తవ్వి రెండు నెలలైనా పనులు చేపట్టలేదు. లింగోజిగూడ డివిజన్ కుమ్మరి బస్తీలో తవ్విన రోడ్డు కంకర తేలి వాహనదారులు, పాదచారులకు ప్రమాదకరంగా మారింది. చిన్నపిల్లలు, వృద్ధులు, వికలాంగులు ఈ దారి గుండా నడవాలంటే భయపడే పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. ఈ రహదారి సమస్యపై స్థానిక కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

స్వీట్‌లో రొయ్యలు వేసి..డబ్బులు డిమాండ్ చేసి

ఇద్దరి అరెస్ట్



పోలీసుల అదుపులో కోటేష్, నరేష్

చైతన్యపురి: స్వీట్‌లో ఎండు రొయ్యను పెట్టి అవి తినటంతో వాంతులు అయ్యాయని, డబ్బులు డిమాండ్ చేసిన ఇద్దరిని సరూర్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి వివరాల ప్రకారం.. సరూర్‌నగర్ వెంకటేశ్వరకాలనీ రోడ్డునంబర్–15లోని శ్రీబాలాజీ మిఠాయి బండార్‌కు శుక్రవారం ఇద్దరు వ్యక్తులు వచ్చారు. స్వీట్ కొనుక్కుని తిని అందులో ఎండురొయ్య వచ్చింది మీ దుకాణంలో స్వీటు తినటంతో వాంతులు అయ్యాయని షాపు యజమనికి తెలిపారు. తాము రిపోర్టలమని ఈ విషయాన్ని సోషల్ మీడియాలో పెడతామని దుకాణం యజమానిని డబ్బులు డిమాండ్ చేశారు. అయితే షాపు యజమాని పోలీసులకు ఫోన్ చేయగా అక్కడ నుంచి పారిపోయారు. యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు మేరకు చిర్ర కోటేష్, వడికొండ నరేష్ అనే ఇద్దరిని శనివారం అరెస్ట్ చేశారు. ఆర్‌ఈ–5 యూట్యూబ్ చానల్, టిపివిపిఏ ఐడి కార్డు పెట్లుకుని వసూళ్లకు పాల్పడినట్లు గుర్తించారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

సాక్షి, సిటీబ్యూరో: సామ్యాస్ స్కిన్ క్లినిక్ మూడో వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నామని ఆసుపత్రి యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. మన్సూరాబాద్ సహకార అపెక్స్ బ్యాంకు పైన గల ఆసుపత్రి బ్రాంచిలో స్కిన్, హెయిర్ సంబంధిత సమస్యలపై ఉచితంగా కన్సల్టెన్సీ ఉంటుందని పేర్కొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9666021515
9912220363
9912220365